సాక్షి
ఆదిలాబాద్
శనివారం, 15, జూలై, 2023



బోథ్: మండల కేంద్రంలో చంద్రయాన్-3 ప్రయోగాన్ని, స్క్రీన్‌పై వీక్షిస్తున్న విద్యార్థులు



చంద్రయాన్ సంబురం

- సక్సెస్‌పై జిల్లాలో వేడుకలు
- ఆసక్తిగా వీక్షించిన విద్యార్థులు
- అద్భుత దృశ్యమని కితాబు
- కేక్ కట్ చేసి, స్వీట్ల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్/బోథ్/తాంసి: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) శుక్రవారం శ్రీహరికోటలో చేపట్టిన చంద్రయాన్-3 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రత్యేక స్క్రీన్‌లు, టీవీలు ఏర్పాటు చేసి నింగిలోకి రాకెట్ వెళ్లడాన్ని విద్యార్థులకు చూపించారు. ప్రయోగం సక్సెస్ కావడంతో విద్యార్థులు కేరింతలతో హోరెత్తించారు. ఉపాధ్యాయులు, లెక్చరర్లు సంతోషం వ్యక్తంజేశారు. జిల్లా కేంద్రంతోపాటు బోథ్ మండల కేంద్రంలో సంబురాలు జరుపుకొన్నారు. కేక్‌లు కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థుల అంతరంగం వారి మాటల్లోనే..



బోథ్: మండల కేంద్రంలో మిఠాయిలు పంచుతున్న యువకులు

దేశానికే గర్వకారణం



ఆదిలాబాద్‌టౌన్: చంద్రయాన్ ప్రయోగం విజయవంతం కావడం దేశానికే గర్వకారణం. దీనిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు అంతరిక్ష శాస్త్రంలో అభిరుచిని పెంచుకుంటారు. ప్రతీ పాఠశాలలో వీక్షించేలా సమాచారం ఇచ్చాం. అంతా ఆసక్తిగా తిలకించారు. చంద్రుడి దక్షిణ ధ్రువంపై కాలుమోపిన నాలుగో దేశంగా భారత్ ఖ్యాతి చెందింది. చంద్రయాన్ విజయవంతం కావడం ఆనందంగా ఉంది.

– రఘురమణ, జిల్లా సైన్స్ అధికారి

ప్రత్యక్షంగా చూడాలని ఉంది



తాంసి: ఇస్రో చేపట్టే రాకెట్ ప్రయోగాలను అక్కడికి వెళ్లి ప్రత్యక్షంగా చూడాలని ఉంది. ఇందుకు బాలశాస్త్రవేత్తలుగా మారాలని ఉపాధ్యాయులు తెలిపారు. వారి సలహాలతో ఇప్పటినుంచే బాలశాస్త్రవేత్తగా మారేందుకు ప్రయత్నిస్తా. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైనందుకు ఆనందంగా ఉంది.

– వైష్ణవి, ఏడో తరగతి, నిపాని పాఠశాల

ప్రతీసారి చూస్తున్నాం



తాంసి: ప్రతీసారి ఇస్రో నుంచి చేపట్టే చంద్రయాన్ ప్రయోగాలను పాఠశాల హెచ్‌ఎం సంతోష్ సార్ చొరవతో టీవీ ద్వారా చూస్తున్నాం. చంద్రయాన్-3 ప్రయోగాన్ని ఆసక్తిగా తిలకించాం. ప్రయోగం విజయవంతమైందని ఉపాధ్యాయులు తెలుపగా సంతోషపడ్డాం. శాస్త్రవేత్తల కృషి విలువైంది.

– మేఘన, ఏడో తరగతి, నిపాని పాఠశాల

ఆశ్చర్యంగా ఉంది



బోథ్: భవిష్యత్‌లో చంద్రుడిపై అడుగుపెడతా. టీవీలో చంద్రుడిపైకి రాకెట్ వెళ్లడం చూశాం. త్వరలో మనమూ వెళ్తామన్న నమ్మకం ఏర్పడుతోంది. చంద్రుడి వద్దకు వెళ్లడం ఆశ్చర్యకరంగా ఉంది.

– శరణ్య, పదో తరగతి

ఆసక్తిగా తిలకించాం



ఆదిలాబాద్‌టౌన్: చంద్రయాన్-3 అంతరిక్షంలోకి వెళ్లే అద్భుత దృశ్యాన్ని మా పాఠశాలలో ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా తిలకించాం. ప్రయోగ సమయంలో ఉత్కంఠగా ఉన్నప్పటికీ విజయవంతం కావడం సంతోషం అనిపించింది. మా ఉపాధ్యాయులు ఈ ప్రయోగం సక్సెస్ అయితే ఎలాంటి ప్రయోజనాలుంటాయో వివరించారు. భవిష్యత్‌లో అంతరిక్ష రంగంలో శాస్త్రవేత్త కావాలని అనుకుంటున్నాను.

– అణన్య, విద్యార్థిని

ఉపయోగాలు తెలుసుకున్న



ఆదిలాబాద్‌టౌన్: చంద్రయాన్-3 ప్రయోగాన్ని మా పాఠశాలలో టీవీ ద్వారా చూశాను. గతంలో చంద్రయాన్-1, చంద్రయాన్-2 నుంచి గత వైఫల్యాలను అధిగమించి ఈసారి చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడం సంతోషమనిపించింది. ఇది ఆగస్టు 23న చంద్రుడిపై కాలు మోపుతోందని మా ఉపాధ్యాయులు తెలిపారు. భవిష్యత్‌లో రాకెట్ల ప్రయోగంలో పాలుపంచుకోవాలని ఉంది.

– రాజేశ్వరి, విద్యార్థిని

చాలా ఆనందంగా ఉంది



ఆదిలాబాద్‌టౌన్: చంద్రయాన్-3 ప్రయోగంలో మూడు భాగాలైన రాకెట్, రోవర్, ఇతర పరికరాలు అంతరిక్షంలోకి వేగంగా దూసుకుపోవడాన్ని ఉత్సాహంగా తిలకించాను. ప్రయోగం విజయవంతం కావడం చాలా ఆనందంగా ఉంది. మా ఉపాధ్యాయులను అడిగి రాకెట్లు, ల్యాండ్ రోవర్లు ఏ విధంగా పనిచేస్తాయో తెలుసుకున్న. నాతోటి విద్యార్థులకు కూడా దీనిని వివరించే ప్రయత్నం చేస్తా.

– బి.శిరీష, విద్యార్థిని

చంద్రుడిపైకి వెళ్లాలనుంది



బోథ్: చందమామపైకి రాకెట్ వెళ్లడం మా పాఠశాలలో చూపించారు. చందమామపైకి నాకూ వెళ్లాలని ఉంది. చంద్రుడి గురించి వినడమే కానీ రాకెట్ ఇలా అక్కడికి వెళ్లే దృశ్యాన్ని చూడడం ఇదే తొలిసారి. భవిష్యత్‌లో శాస్త్రవేత్త కావాలనుకుంటున్నాను. తప్పకుడా చంద్రుడి వద్దకు వెళ్తాను.

– అజన్, ఎనిమిదో తరగతి

న్యూస్‌రీల్

మంత్రి హరీశ్‌రావును కలిసిన జెడ్పీటీసీ



మంత్రి హరీశ్‌తో జెడ్పీటీసీ దంపతులు

బోథ్: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ సంధ్యారాణి శుక్రవారం హైదరాబాద్‌లో ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి విన్నవించారు. బోథ్ నియోజకవర్గంలో తొమ్మిది మండలాలున్నాయని, పాలన సౌలభ్యం కోసం బోథ్, నేరడిగొండ, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, సిరికొండ మండలాలను కలుపుతూ బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరారు. బోథ్‌లో తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనం, యువత కోసం నాలెడ్జ్ సెంటర్, మినీ స్టేడియం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని విన్నవించారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు. మంత్రిని కలిసినవారిలో ఆమె భర్త రాజనాల రవీంద్రప్రసాద్ ఉన్నారు.

ఇద్దరు ఆర్డీవోల బదిలీ

కైలాస్‌నగర్: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఆర్డీవోలు బదిలీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీవోలను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ ఆర్డీవోగా పనిచేస్తున్న రాథోడ్ రమేశ్‌ను ప్రభుత్వానికి రిపోర్టు చేయాల్సిందిగా పేర్కొంది. ఆయన స్థానంలో నిర్మల్ ఆర్డీవో టీ స్రవంతిని నియమించింది. అలాగే ఉట్నూర్ ఆర్డీవోగా ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన కే మహేశ్వర్‌ను కరీంనగర్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

గెజిట్ విడుదల చేయాలి



కలెక్టర్‌ను సన్మానిస్తున్న తుల శ్రీనివాస్

బోథ్: సొనాలను మండలంగా ఏర్పాటు చేస్తూ పూర్తిస్థాయి గెజిట్‌ను త్వరగా విడుదల చేయాలని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ శుక్రవారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి విన్నవించారు. సొనాలలో కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి, వాటి పనులు ప్రారంభించడానికి అధికారులకు ఆదేశాలివ్వాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించారు. బోథ్ సర్పంచుల సంఘం అధ్యక్షుడు బండారి శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



వడగామ్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఇంద్రవెల్లి: నాణ్యమైన విద్య అందించాలని ఐటీడీఏ పీవో చాహత్‌బాజ్‌పాయ్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల, వడగామ్, పిట్టబొంగరం ఆశ్రమ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యాంశాల్లోని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండి విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించాలని ఉపాధ్యాయులకు చెప్పారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి



రేషన్‌బియ్యం పంపిణీ చేస్తున్న మనోహర్

బేల: ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని హేటి గ్రామంలో నూతనంగా ప్రత్యేక రేషన్‌షాపు ప్రారంభించి బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే అర్హులైన నిరుపేదలకు కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తుందన్నారు. ప్రజలకు దూరభారాన్ని తగ్గించేందుకు ఇక్కడ రేషన్‌షాపు ఏర్పాటు చేయించామని తెలిపారు. రేషన్ డీలర్ రమేశ్, బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రాక్రే గంబీర్, యూత్ నాయకులు సతీశ్‌పవార్, బండి సుదర్శన్ తదితరులున్నారు.

‘తుడుం దెబ్బ నిర్ణయాలతో ఎంపీకి సంబంధం లేదు’

ఇచ్చోడ: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర కమిటీ తీసుకున్న నిర్ణయాలకు ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావుకు ఎలాంటి సంబంధంలేదని రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్ తెలిపారు. శుక్రవారం ఇచ్చోడలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ సుదీర్ఘంగా చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ఇవి ఏ ఒక్కరి స్వార్థప్రయోజనాల కోసం కాదని పేర్కొన్నారు. ఆదివాసీ హక్కుల కోసం ముందుండి పోరాటం చేస్తున్న తుడుం దెబ్బ ద్వారా కొన్నివేల మంది ఆదివాసీల జీవితాలు ముడిపడి ఉన్నాయని తెలిపారు. తుడుం దెబ్బ చేసిన పోరాటాల ఫలితంగానే ఆదివాసీలు తమ హక్కులు పొందగలుగుతున్నారని పేర్కొన్నారు. తుడుం దెబ్బ తీసుకున్న నిర్ణయాలను ఆదివాసీ ఎంపీటీసీ జంగు తప్పుపట్టడం సరికాదన్నారు. సోయం బాపూరావుకు తుడుం దెబ్బకు ఉన్న సంబంధాలపై మాట్లాడే స్థాయి జంగుకు లేదన్నారు. ఆదివాసీ హక్కుల కోసం నిరంతర ఉద్యమాలు చేసే తుడుం దెబ్బపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నవారిని ఆదివాసీ సమాజం గమనించాలని కోరారు.

నేటితో ఓటరు నమోదు గడువు పూర్తి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఓటరు నమోదు గడువు నేటితో పూర్తవుతుందని, అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. శుక్రవారం స్థానిక ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో ప్రత్యేక ఓటరు నమోదు అవగాహన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థినులు, మహిళలు వేసిన ముగ్గులు పరిశీలించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ వారి కుటుంబ సభ్యుల ఓటు వివరాలు https:// www.nvsp.in పోర్టల్‌లో ఎపిక్ నంబర్‌తో పరిశీలించుకోవాలని సూచించారు. జిల్లా యువజన సంక్షేమాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమాధికారి మిల్కా తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

- కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందిస్తున్నామని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ రాష్ట్రస్థాయి అధికారులతో కలిసి సాధారణ ఎన్నికలపై సమీక్షించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఉపయోగం కోసం డిజిటల్ అవ్రేర్నెస్‌పై జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్షించారు. రెండో విడత ఓటరు జాబితా సవరణలో భాగంగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలకు ముందు వచ్చిన ప్రతీ దరఖాస్తును స్క్రూటినీ పూర్తి చేయాలని, ఓటరు జాబితా నుంచి తొలగించిన ఓటర్ల వివరాలు క్షేత్రస్థాయిలో మరోసారి ధ్రువీకరణ, ఇంటికి ఆరు కంటే అధికంగా ఉన్న ఓటర్ల వివరాల ధ్రువీకరణను పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఇంటింటి సర్వేలో సేకరించిన దరఖాస్తులు, ఆన్‌లైన్ ద్వారా ఫారం-6, ఫారం-7, ఫారం-8 కింద వచ్చిన దరఖాస్తులను జూలై 27 నాటికి ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలో ఈవీఎంలు, వీవీ ప్యాట్ల వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రచార వాహనాలు ఏర్పాటు చేసి పోలింగ్‌కేంద్రం వారీగా పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పించేవారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. సెప్టెంబర్ చివరి వరకు జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పూర్తిస్థాయి అవగాహన కల్పించేలా షెడ్యూల్ రూపొందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా పురుషులు, మహిళల ఓటర్ల వయస్సు, జనాభా నిష్పత్తి, లింగ నిష్పత్తి వివరాల నివేదికలు తయారు చేయాలని, మండలాల వారీగా సమాచారం సేకరించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్, ఆర్డీవో రాథోడ్ రమేశ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియ, తహసీల్దార్లు పాల్గొన్నారు.

‘అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి’



వివరాలు తెలుసుకుంటున్న అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ

ఇంద్రవెల్లి: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 అవార్డు ఎంపికలో భాగంగా ముత్నూర్ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ సూచించారు. శుక్రవారం మండలంలోని ముత్నూర్ గ్రామాన్ని సందర్శించి అధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. చేపట్టాల్సిన పనుల వివరాలు తెలుసుకున్నారు. ప్రతీ ఇంట్లో మరుగుదొడ్డి, ఇంకుడుగుంత నిర్మించుకునేలా చూసి వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. పల్లె ప్రకృతి వనం, తెలంగాణ క్రీడా ప్రాంగణంలో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల భవనాలకు రంగులు వేయాలని సూచించారు. సీఈవో గణపతి, డిప్యూటీ సీఈవో రాజేశ్వర్ రాథోడ్, డీఎల్పీవో భిక్షపతిగౌడ్, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో సంతోష్, ఏపీవో శ్రీనివాస్ తదితరులున్నారు.

‘విద్యార్థుల బాధ్యత విస్మరించడం సరికాదు’

బేల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 20లక్షల మంది విద్యార్థుల బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తోందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ ప్రశ్నించారు. శుక్రవారం మండలకేంద్రంలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. సంఘం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెగ్యులర్, సబ్జెక్ట్ ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంలేదన్నారు. ప్రస్తుతం గురుకులాల పేరు పెట్టి.. గురుకులాల వైపు ప్రజలను మళ్లిస్తూ, ప్రభుత్వ, జిల్లా పరిషత్‌తోపాటు గిరిజన సంక్షేమ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్న పరిస్థితి కనిపిస్తోందని తెలిపారు. ఇది సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. నిధులు లేక ‘మన ఊరు-మన బడి’ నిర్వీర్యం అవుతోందని తెలిపారు. రోజురోజుకూ విద్యారంగాన్ని దిగజారుస్తున్నారని పేర్కొన్నారు. 2014లో తొమ్మిదో స్థానంలో ఉన్న రాష్ట్ర విద్యారంగం, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం తీరుతోనే ప్రస్తుతం 34వ స్థానానికి చేరిందన్నారు. విద్యారంగం అభివృద్ధి, బలోపేతంతో బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఏ స్వామి, జిల్లా కార్యదర్శి ఈ శివన్న, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయకర్, ప్రేంసింగ్, నరేశ్‌కుమార్, విఠోబా, లక్ష్మణ్, పాచ్చిరాం తదితరులున్నారు.

రేపు స్విమ్మింగ్ పోటీలు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈనెల 16న జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోగల స్విమ్మింగ్ పూల్‌లో జిల్లా స్థాయి ఈత పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. బాలబాలికల సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఇందులో ప్రతిభ కనబర్చినవారు ఈనెల 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని ఆగస్టులో ఒడిశాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. గ్రూప్ వన్‌లో 15, 16,17 ఏళ్ల బాలబాలికలు, గ్రూప్ టూలో 12,13, 14, గ్రూప్ త్రీలో 10, 11 ఏళ్లవారు ఉంటారని పేర్కొన్నారు. ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్, బటర్‌ఫ్లై, ఇండివిజువల్ మెడ్లే విభాగాల్లో పోటీలుంటాయని వివరించారు. ఆసక్తిగలవారు స్థానిక స్విమ్మింగ్ పూల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

పలువురికి పోలీస్ సేవా పతకాలు

ఆదిలాబాద్‌టౌన్: ఉత్తమ సేవలందించిన జిల్లా పోలీసులకు ప్రభుత్వం సేవా పతకాలు ప్రకటించింది. ఈ మేరకు హోంశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. మహిళా పోలీస్‌స్టేషన్ ఏఎస్సై అనిత, ఆదిలాబాద్ ఏఆర్ ఎస్సైలు రమేశ్, దత్తురాం, మహ్మద్‌ఫారూక్, ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు విజయ్‌రావ్, మహ్మద్‌ఖాన్, ఇంద్రవెల్లి పీఎస్ కానిస్టేబుల్ పరశురాం, ఇచ్చోడ పీఎస్ కానిస్టేబుల్ గంగారాం, టూటౌన్ కానిస్టేబుల్ కిశోర్, ఆదిలాబాద్ ట్రాఫిక్ ఎస్సై ఖాజా గౌస్‌మొయినొద్దీన్ పతకాలకు ఎంపికయ్యారు. వీరికి రూ.20వేల నగదు, ప్రశంసాపత్రాలు అందజేయనున్నారు.

రైతుబీమా సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య



బరంపూర్ గ్రామంలో డీఏవో పుల్లయ్యకు బీమా పత్రాలు ఇస్తున్న రైతులు

తలమడుగు: పట్టా పాసుపుస్తకం కలిగిన 18-57 ఏళ్ల లోపు రైతులంతా రైతుబీమాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి డీ పుల్లయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని బరంపూర్, సుంకిడి, తలమడుగు, ఝరి, చెర్లపల్లి గ్రామాల్లో రైతుబీమా నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా పోడు పట్టాలు తీసుకున్న రైతులు, గతంలో నమోదు చేసుకోని రైతులు రైతుబీమా కోసం ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, నామిని పేరు, నామిని ఆధార్‌కార్డులతో ఏఈవో దగ్గర నమోదు చేయించుకోవాలని సూచించారు. 18.06.2023 వరకు పట్టాలు పొందిన రైతులు వారి పట్టాదారు పాసుపుస్తకాలు ఆధార్‌కార్డు, నామినేషన్ ఫారంలో నమోదు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో పంటల నమోదు కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో మహేందర్, ఏఈవోలు రమేశ్, సౌజన్య తదితరులున్నారు.

క్లుప్తంగా

ఆస్ట్రేలియాలో ఎమ్మెల్సీని కలిసిన ఖానాపూర్ వాసి



కవితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సాయిరాం

ఖానాపూర్: ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో జరిగే తెలంగాణ బోనాల వేడుకకు జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖానాపూర్ మండలం మస్కాపూర్ నివాసి, బీఆర్ఎస్ ఆస్ట్రేలియా విక్టోరియా అధ్యక్షులు ఉప్పు సాయిరాం కవితకు పుష్పగుచ్ఛం ఇచ్చి పార్టీ శ్రేణులతో కలిసి ఘన స్వాగతం పలికారు.

పంచాయతీ కార్మికుడిపై డీఎల్పీవో విచారణ



మాట్లాడుతున్న డీఎల్‌పీవో రమేశ్

దస్తురాబాద్: మండలంలోని మున్యాల గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న ఏ.నర్సయ్య విధులకు హాజరు కాకపోవడంతో గ్రామ సర్పంచ్ శంకర్ ఫిర్యాదు మేరకు శుక్రవారం డీఎల్‌పీవో వార్డు సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మల్టీపర్పస్ వర్కర్‌పై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సయ్య నెల రోజుల నుంచి గ్రామ పంచాయతీ పారిశుద్ధ పనులకు హాజరు కావడం లేదన్నారు. గ్రామ సర్పంచ్ శంకర్ మల్టీపర్పస్ వర్కర్‌తో సొంత పనులు చేయిస్తుండడంతోనే విధులకు హాజరుకావటం లేదని పేర్కొన్నారు. ఇందులో ఎంపీవో అనిల్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి ఉన్నారు.

గుడుంబా పట్టివేత

బోథ్: మండలంలోని ధన్నూర్ కె గ్రామంలో గుడుంబా విక్రయిస్తుండగా రాథోడ్ పరశురాంను ఎస్సై రవీందర్ పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సమాచారం మేరకు శుక్రవారం సాయంత్రం 6గంటల ప్రాంతంలో దాడిచేయగా గుడుంబా విక్రయిస్తున్న రాథోడ్ పరశురాంను పట్టుకుని అతడి వద్ద నాలుగు లీటర్ల గుడుంబాను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ రాంచందర్ ఉన్నారు.

దేశీదారు పట్టివేత..

జైనథ్: మండలంలోని సాంగ్వి గ్రామంలోని ఓ కిరాణా షాపు నుంచి 48 దేశీదారు సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పెర్సిస్ బిట్ల తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం గ్రామంలో దాడులు నిర్వహించగా షాపులో 48 దేశీదారు సీసాలు లభించినట్లు తెలిపారు. అక్కడే ఉన్న విక్రయదారుడు సిడాం ప్రతాప్ పోలీసులను చూసి పారిపోయాడు. సిడాం ప్రతాప్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఆమె తెలిపారు.

మహిళ అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని న్యూహౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన పల్లవి అనే మహిళ అదృశ్యమైనట్లు మావల ఎస్సై ఇసాఖ్‌అలీ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సదరు మహిళ గురువారం ఉదయం పూజల నిమిత్తం ఆలయానికి వెళ్లింది. రాత్రి వరకు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఆమె తండ్రి మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

తగ్గుతున్న ఇంటర్ అడ్మిషన్లు

- ప్రభుత్వ కళాశాలల్లో మిగిలిపోతున్న సీట్లు
- ఉమ్మడి జిల్లాలోని 46 కాలేజీల్లో 7,447 విద్యార్థుల నమోదు
- గురుకులాలకు మొగ్గుచూపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు
- గురుకులాల్లో ప్రవేశాలు ఫుల్



నిర్మల్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ

నిర్మల్‌ఖిల్లా: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు తగ్గుతున్నాయి. ఏటేటా ప్రవేశాలు తగ్గుతూ వస్తున్నాయి. 2023–24 విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడిచినా ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. గురుకులాల నుంచే ప్రభుత్వ కళాశాలలకు పోటీ ఎదురవుతోంది. విద్యార్థులతో పాటు, తల్లిదండ్రులు కూడా గురుకులంలో చదువుకోవడమే మేలని భావిస్తున్నారు. దీంతో పదో తరగతి పూర్తికాగానే వివిధ కురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు ఏటా తగ్గుతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 46 కాలేజీలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 46ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. అయితే జిల్లాలోని విద్యార్థులు ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల్లో చేరేందుకు మొగ్గు చూపడం లేదు. తల్లిదండ్రులు కుదిరితే ప్రైవేటు, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో చేర్పిస్తున్నారు. పేద, మధ్య తరగతి తల్లిదండ్రులు ఆడపిల్లల్ని కేజీబీవీలలో చేర్పేందుకు ఆసక్తి చూపుతున్నారు. బాలురను గురుకుల కళాశాలల్లో చేర్పిస్తున్నారు. దీంతో డేస్కాలర్ కళాశాలలుగా కొనసాగుతున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో జరుగుతున్న అడ్మిషన్లు ఏటా తగ్గుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం అడ్మిషన్లు తగ్గినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

గురుకులాల్లో సౌకర్యాలు..

ప్రభుత్వ కళాశాలలతో పోలిస్తే గురుకుల కళాశాలల్లో సౌకర్యాలు మెరుగ్గా ఉన్నాయని విద్యార్థులు, తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. గుకుకులాల్లో పుస్తకాలతోపాటు భోజనం, వసతి కల్పిస్తున్నట్లు చెబుతున్నారు. డేస్కాలర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన హామీ ఏళ్లు గడుస్తున్నా అమలు కావడం లేదని పేర్కొంటున్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు అందిస్తున్నా.. అధ్యాపకుల కొరత, మధ్యాహ్న భోజనం లేకపోవడం, తరగతులు సక్రమంగా జరగకపోవడం, డేస్కార్ కాలేజీలకు ఉదయం వెళ్లి సాయంత్రం రావాల్సి ఉండడంతో చాలా మంది తల్లిదండ్రులు గురుకులాలవైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

ఆలస్యంగా అడ్మిషన్లు..

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యంగా జరుగుతోంది. ఈలోపే ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల ప్రతినిధులు పిల్లల ఇంటికి వెళ్లి తమ కాలేజీల్లో చేర్పించుకుంటున్నారు. ఇక ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు అడ్మిషన్ల సమయంలో సప్లిమెంటరీ పరీక్షలు, పేపర్ మూల్యాంకన బాధ్యతల్లో ఉండి.. అవి అయిన తర్వాత ప్రవేశాలు కల్పిస్తున్నారు. అప్పటికే విద్యార్థులు ప్రైవేటు, గురుకులాల్లో చేరుతున్నారు.

గురుకులాల్లో ఎంసెట్, నీట్, ఐఐటీ శిక్షణ..

గురుకుల కళాశాలల్లో సెకండియర్ విద్యార్థులకు ఇంటర్ తర్వాత నిర్వహించే పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఇలాంటి సదుపాయం లేదు. సిలబస్ బోధించడం వరకే అధ్యాపకులు పరిమితమవుతున్నారు. గురుకులాల్లో అధ్యాపకులు రాత్రి వరకు అందుబాటులో ఉంటున్నారు. అనుమానాలు నివృత్తి చేసుకునే అవకాశం విద్యార్థులకు ఉంటుంది. డేస్కాలర్స్‌లో ఇలాంటి అవకాశం లేదు.

జూలై 12నాటికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అడ్మిషన్ల వివరాలు..

జిల్లా	కాలేజీల సంఖ్య	సాధారణ విద్యార్థులు	ఒకేషనల్ విద్యార్థులు	మొత్తం
ఆదిలాబాద్	13	2,281	423	2,704
నిర్మల్	12	1,652	285	1,937
కుమురంభీం	11	1,401	321	1,722
మంచిర్యాల	10	8,18	296	1,114
మొత్తం	46	6,152	1325	7,477





అడ్మిషన్ల కోసం ప్రచారం నిర్వహిస్తున్న జూనియర్ అధ్యాపకులు

అడ్మిషన్లు పెరిగేలా ప్రయత్నిస్తున్నాం...



ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్లు పెంచేందుకు ప్రయత్నిస్తున్నాం. అడ్మిషన్లకు గడువున్నందున సంఖ్య పెరుగుతుందని ఆశిస్తున్నాం. పదో సప్లిమెంటరీ ఫలితాలు ఇటీవలే వెల్లడయ్యాయి. ట్రిపుల్ ఐటీ ప్రవేశాలు పూర్తి కాలేదు. దీంతో అడ్మిషన్ల కోసం ప్రయత్నిస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులు తమపిల్లల్ని గురుకులాల్లో జాయిన్ చేసేందుకు మొగ్గు చూపడం అడ్మిషన్లలో తగ్గుదలకు కారణం.

– పరశురాం జాదవ్, డీఐఈవో, నిర్మల్

వినూత్న వ్యవసాయం...



పత్తి చేనులో కలుపు మొలకలు తీస్తున్న రైతు

ముధోల్: రోజురోజుకూ యాంత్రీకరణ పెరిగిపోతున్న రోజుల్లో రైతులు కూడా వినూత్నంగా వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. ముధోల్ మండల కేంద్రానికి చెందని మహ్మద్ ఎకారోద్దిన్ ఇటీవల కురిసిన వర్షాలకు తనకున్న రెండెకరాల్లో పత్తి పంట వేశాడు. కలుపు మొక్కలు ఏపుగా పత్తి చేనులో పెరగాయి. తన వద్ద కాడెడ్లు లేకపోవడంతో పాత సైకిల్‌ను సగం వరకూ ఊడదీసి కలుపు మొక్కలు తీసే చిన్నపాటి పలుగును బిగించారు. దాని తమ్ముని సహాయంతో కలుపు మొక్కలను తొలగిస్తున్నాడు.

హరితనిధి.. విలువిది..



చెట్టు నీడన మాట్లాడుతున్న మంత్రి, ఐడీసీ చైర్మన్, కలెక్టర్

నర్సాపూర్(జి): మొక్కలు నాటితే అది ఎన్ని ప్రయోజనాలను చేకూరుస్తుందో చెప్పడానికి ఈ చిత్రమే నిదర్శనం. నర్సాపూర్ (జి) మండల కేంద్రంలోని గ్రామ శివారులో శుక్రవారం నిర్వహించిన హరిత నిధి నర్సరీ కార్యక్రమం ప్రారంభోత్సవానికి రాష్ట్ర అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, టీఎస్ ఐడీసీ చైర్మన్, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, సీసీఎఫ్ శరవణన్, డీఎఫ్‌వో సునీల్ హీరామత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారంతా కాసేపు మాట్లాడటానికి ఈ పచ్చని వేపచెట్టు నీడనివ్వడం హరితనిధి కార్యక్రమానికి సార్థకతను చేకూర్చింది

తిరిగి బయటకొస్తే ఆశీర్వదిస్తాం..



మాట్లాడుతున్న కాంగ్రెస్ మున్నూరుకాపు నాయకులు

నిర్మల్‌టౌన్: ఇటీవలే బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పల గణేష్ తిరిగి బయటకు వస్తే మున్నూరు కాపు బిడ్డగా అందరం ఆశీర్వదిస్తామని కాంగ్రెస్ పార్టీ మున్నూరు కాపు నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మున్నూరు కాపుల ఆత్మగౌరవాన్ని మంత్రి పాదాల కింద తాకట్టుపెట్టి, తలదించుకునేలా చేశారని మండిపడ్డారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మున్నూరుకాపు నాయకులు పొడేల్లి గణేష్, నాందేడపు చిన్ను, పడాల శ్రీనివాస్, ఈటెల శ్రీనివాస్, దశరథ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మున్నూరుకాపు నాయకులు

మున్నూరు కాపులకు క్షమాపణ చెప్పాలి

నిర్మల్‌టౌన్: మున్నూరు కాపులను విమర్శించిన కాంగ్రెస్ నేత శ్రీహరిరావు వెంటనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ పట్టణ మున్నూరుకాపు నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పల గణేష్ బీజేపీని వీడి బీఆర్ఎస్‌లో చేరితే మున్నూరు కాపుల ఆత్మగౌరవాన్ని మంత్రి పాదాల వద్ద తాకట్టు పెట్టారని అవమానించేలా మాట్లాడడం సరికాదన్నారు. ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, కౌన్సిలర్లు రమణ, ఎస్పీ రాజు, పద్మకార్ ఉన్నారు.

స్పందించారు.. యువతి ప్రాణాలు కాపాడారు

- కుంటాల జలపాతం వద్ద ఆత్మహత్య చేసుకోకుండా యువతిని అడ్డుకున్న పోలీసులు
- అనంతరం ఆమె తండ్రికి అప్పగింత

నేరడిగొండ: కుంటాల జలపాతం వద్ద ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన ఓ యువతిని పోలీసులు ముందస్తుగా గుర్తించి ప్రాణాలు కాపాడారు. ఇచ్చోడ సీఐ చంద్రశేఖర్, నేరడిగొండ ఎస్సై సాయన్న కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని మధురనగర్‌కు చెందిన యువతి ఈవెంట్ మేనేజర్‌గా పనిచేస్తోంది. ఆమె మానసిక స్థితి సరిగా లేదని, శుక్రవారం ఉదయం ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు కుటుంబీకులు మధురనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉదయం 5గంటలకు కారులో బయటకు వెళ్లినట్లు లొకేషన్ ద్వారా అక్కడి పోలీసులు గుర్తించారు. ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి కుంటాల జలపాతానికి వస్తున్నట్లు స్థానిక పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఇచ్చోడ సీఐ ఆధ్వర్యంలో ఎస్సై సాయన్న సిబ్బందితో కలిసి జలపాతానికి చేరుకున్నారు. అక్కడికి వచ్చిన ఆ యువతిని గుర్తించి పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి ఆమె తండ్రికి అప్పగించారు. కుంటాల జలపాతం వద్ద ఉన్న అటవీశాఖ, బేస్ క్యాంప్ సిబ్బంది, కుంటాల జలపాతం గైడ్‌లు అప్రమత్తమై ఆమె మెట్లు దిగే సమయంలో ఆ యువతిని అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించడంతో వారిని అభినందించారు.

మైనార్టీ గురుకుల విద్యార్థులకు అస్వస్థత



ఉట్నూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. గురువారం మధ్యాహ్నం పురుగుల అన్నం తినడంతో పాఠశాలకు చెందిన విద్యార్థులు ముగ్గురు పార్థసారధి, సల్మాన్, షేక్ ఆదిప్‌లు వాంతులు చేసుకోవడంతో సిబ్బంది మాత్రలు వేసి సాయంత్రం తల్లిదండ్రులకు కబురు చేసి ఇంటికి పంపించారు. అయితే లక్కారం గ్రామానికి చెందిన శంకర్ కుమారుడు పార్థసారథిని ఇంటికి వెళ్లగా వాంతులు ఎక్కువ కావడంతో ఉట్నూర్ ఆస్పత్రికి తీసుకుకెళ్లి అడ్మిట్ చేశారు. అదే విధంగా సల్మాన్, ఆదిప్ సైతం ఉట్నూర్ ఆస్పత్రిలో వైద్యం అందుకుంటున్నారు. పురుగులు అన్నం తినడంతో పిల్లలు అనారోగ్యం బారిన పడ్డారని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వార్డెన్‌ను వివరణ కోరగా.. పిల్లలు సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారని వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి ఇంటికి పంపించామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని దంతన్‌పల్లి పెద్ద వాగు వద్ద వంతెన వద్ద ఏర్పడిన గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. శుక్రవారం నార్నూర్ మండలంలోని మాంజ్రీకి చెందిన ఇద్దరు యువకులు కరీంనరగ్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదవశాత్తు పడిపోయారు. వారిని ఆస్పత్రికి తరలించారు.

పై'చేయి'కి ఎత్తులు!



మంచిర్యాల సమీపం గద్దెరాగిడిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మాజీ మంత్రి గడ్డం వినోద్

- కాంగ్రెస్‌లో అంతర్గత గ్రూపులు
- ఒక్కో వర్గంలో ఒక్కో తీరుగా వ్యవహారం
- తమ వారికే టికెట్లు దక్కేలా ప్రోత్సాహం
- పోటాపోటీగా కార్యక్రమాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీలో వర్గపోరుతో నాయకులు పై'చేయి' సాధించేందుకు పోటీ పడుతున్నారు. పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తూ పట్టు కోసం ప్రయత్నిస్తున్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీలో గత కొంతకాలంగా అంతర్గత వర్గపోరు నడుస్తున్న విషయం తెలిసిందే. తాజాగా తామంతా ఒకటేనని తెలియజేస్తూ శుక్రవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి గోమాస శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి గడ్డం వినోద్, కుమురంభీం జిల్లా పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు భరత్‌చౌహాన్, సీనియర్ నాయకులు కేవీ.ప్రతాప్, అడె గజేందర్, ఒడ్నాల శ్రీనివాస్ తదితర నాయకులు, టికెట్ ఆశావహులతో మంచిర్యాలలోని గద్దెరాగిడి సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం పేరిట సమావేశం నిర్వహించారు. ఖానాపూర్, బోథ్, ఆసిఫాబాద్, మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల నుంచి పార్టీ టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులతోపాటు కార్యకర్తలు సైతం హాజరయ్యారు. గత కొంతకాలంగా పార్టీలో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్‌రావుతో కొందరు సీనియర్ నాయకులు విభేదిస్తున్నారు. తాజాగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం సైతం ఆయన లక్ష్యంగానే సాగినట్లు భావిస్తున్నారు. ఈ సమావేశంతో అధిష్టానానికి, జిల్లా పార్టీ నాయకత్వంలో ఓ సందేశం ఇచ్చేలా నిర్వహించారు.

'పీఎస్సార్'కు చెక్ పెట్టేందుకేనా?

జిల్లా కాంగ్రెస్ పార్టీలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు చెందిన రెండు వర్గాలు కొనసాగుతున్నాయి. ఈ వర్గాల్లో ఒకరి వర్గంతో మరొక వర్గం దూరంగా ఉంటున్నారు. జిల్లాలో 'భట్టి' విక్రమార్క నిర్వహించిన పాదయాత్రకు అన్నీ తానై మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్) వ్యవహరించారు. ఇదే సమయంలో 'భట్టి' యాత్రకు కొందరు సీనియర్లు మాత్రం దూరంగా ఉన్నారు. మరికొందరు అంటీముట్టనట్లు వ్యవహరించారు. ఇక జిల్లాలో మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ఒక్కో వర్గం తమ అనుకూల నాయకులను ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రచారం చేసుకుంటున్నారు. ఒక్కో వర్గంలో ఇద్దరు, ముగ్గురు చొప్పున అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఎవరికి వారు ఎన్నికల ముందు ప్రజల్లోకి వెళ్తూ, వేర్వేరుగానే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరితోపాటు పార్టీలో చేరుతున్న కొత్త వారు, టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులను ప్రోత్సహిస్తున్నారు. పీఎస్సార్ తనకు అనుకూల నాయకులను ఆయా చోట్ల అభ్యర్థులుగా చెబుతున్నారని మరో వర్గం వాదన. ఆయన తన నియోజకవర్గంతోపాటు ఇతర నియోజకవర్గాల్లోనూ అభ్యర్థులను ఎంపిక చేస్తున్నట్లు ఇప్పటికే రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదులు అందాయి. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి గడ్డం వినోద్, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు చెక్‌బౌన్స్ వ్యవహారం సైతం రాజకీయ కోణంలో చూస్తున్నారు. ఇక పీఎ స్సార్ వర్గీయులతో వినోద్‌కు వ్యతిరేకంగా బెల్లంపల్లిలో 'లోకల్' అంశం తెరపైకి తెచ్చారనే విమర్శలు ఉన్నాయి.

'తమ' వారికే మద్దతు

ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీలో తమ అనుకునే వారికే టికెట్లు ఇస్తారని ప్రచారం చేస్తున్నారు. వారికే పార్టీ నుంచి ప్రోత్సాహం ఇస్తున్నారు. దీంతో ఎవరికి వారే తమకే టికెట్ అన్నట్లుగా భావిస్తున్నారు. ఒక్కోచోట ఒక్కో తీరుగా ఉండడంతో ఎవరిని టికెట్ వరిస్తుందో చెప్పలేని పరిస్థితి. అయినప్పటికీ ఎన్నో ఏళ్లుగా పార్టీలో పని చేస్తున్న వారితోపాటు కొత్తగా పార్టీలో చేరుతున్నవారు సైతం టికెట్ ఆశించే పని చేస్తున్నారు. ఏ వర్గంలో ఉంటే టికెట్ వస్తుందోనని బేరీజు వేసుకుని ఆ నాయకుల వెంట నడుస్తున్నారు. పోటాపోటీ కార్యక్రమాలు చేస్తున్నారు. మూడు నియోజకవర్గాల పరిధిలో టికెట్లు కోరుతున్న వారంతా అటు అధిష్టానం దృష్టిలో పడేందుకు, ఇటు ప్రజలు, కార్యకర్తల్లో నాయకులుగా గుర్తింపు పొందేందుకు చెమటోడుస్తున్నారు. చివరకు ఏ వర్గం పై 'చేయి' సాధిస్తుందో వేచి చూడాల్సి ఉంది. ఈ క్రమంలో పార్టీలో గ్రూపులను తొలగించి, పార్టీని బలోపేతం చేయాల్సిందిగా కింది స్థాయి కార్యకర్తలు కోరుతున్నారు.

స్కాలర్‌షిప్ నిధులు విడుదల చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నిర్మల్‌రూరల్: విద్యార్థులకు పెండింగ్‌లోని స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రశాఖ పిలుపుమేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో మానవహారం, నిరసన చేపట్టారు. ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ కైరి శశిధర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ రాష్ట్రంలో విద్యార్థుల జీవితాన్ని గాలికి వదిలేసిందన్నారు. రాష్ట్రం ఏర్పడిన మొదటి సంవత్సరం విద్య కోసం 11% నిధులు ఇచ్చిన ఈ రాష్ట్ర ప్రభుత్వం.... ఇప్పుడు కేవలం ఆరు శాతం నిధులు కేటాయించి విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. స్కాలర్‌షిప్‌ల అండ చూసుకుని చదువుకుంటున్న పేద విద్యార్థులను పట్టించుకోకుండా రూ.5300 కోట్ల స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉంచిందన్నారు. పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. 'మార్పు కోసం–మహా ఉద్యమం' పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇందూర్ విభాగ్ స్టూడెంట్ ఫర్ సేవ కన్వీనర్ చంద్రగిరి శివకుమార్, హాస్టల్ కన్వీనర్ దినేష్, రఘు, అజయ్ పవన్, సాయి పాల్గొన్నారు.